లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం


కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజ

నంద్యాల(వ్యవసాయం): లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని మూడవ అదనపు జిల్లా జడ్జి లోక్ అదాలత్ చైర్మన్ అమ్మన్నరాజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమంలో 610 కేసులను పరిష్కారం లభించినట్లు వారు తెలిపారు. పలు కేసుల్లో రాజీ దారులకు రూ.6.21 కోట్లు పరిహారం అందించామన్నారు. చిన్న చిన్న సమస్యలకు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా లోక్ అదాలత్‌కు వెళితే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఒక్క క్షమాపణతో ఎంత పెద్ద గొడవ అయినా సద్దుమణుగుతుందన్నారు. రాజీకాగల కేసుల పరిష్కారం కోసం న్యాయవాదులు, పోలీసులు ఎంతో కృషి చేస్తున్నట్లు వారు అభినందించారు. కుటుంబ కలహాల వల్ల భార్యాభర్తలు కోర్టును ఆశ్రయిస్తే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. రాజీయే రాజమార్గమని కక్షిదారులు తెలుసుకోవాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో మోటారు వెహికల్ కేసులు 58, ఈపీ 16, సివిల్ కేసులు 6, ఐపీసీ కేసులు 30, ఎన్ఐయాక్టు కేసులు నాలుగు, మెయింటనెన్స్ కేసులు 4, ఎక్సైజ్ 32, ఎస్టీసీ 415, పీఎస్సీ కేసులు 45 కేసులను పరిష్కరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, ముక్కెర కృష్ణారెడ్డి, నీలి శ్రీనివాసులు, రమణ, వివేకానందరెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

- లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- 374 కేసుల పరిష్కారం


కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

ఆళ్లగడ్డ: ఎలాంటి సమస్యలైన రాజీ మార్గం ద్వారా సకాలంలో పరిష్కరించుకోవచ్చని అదనపు జిల్లా న్యాయమూర్తి రాజేంద్రబాబు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఇందులో 374 కేసులు పరిష్కారం అయ్యాయి. రూ.50.81 లక్షలు కక్షిదారులకు అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఇరువర్గాల ఆమోదంతో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించి ఇరువురికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులపై హైకోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. లోక్ అదాలతే అంతిమ తీర్పు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శైలజ ఉన్నారు.

ఉద్యోగుల సంక్షేమం మరిచిన ప్రభుత్వం


మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో మౌలాలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమంపై అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం 15 నెలల కాలంలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేకపోయిందని మండిపడ్డారు. మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని, పీఆర్సీ గడువు ముగిసినా ఇంత వరకు పీఆర్సీ నియమించలేదన్నారు. సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం చేస్తామని చెప్పినప్పటికీ ఉద్యోగ సంఘాలతో చర్చించలేదన్నారు. పదవీ విమరణ చేసిన ఉద్యోగులు పది నెలలుగా గ్రాట్యుటీ కూడా చెల్లించలేదన్నారు. ఎస్ఎస్‌సీ మూల్యకనం విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు వెంటనే మూల్యాంకన భత్యాన్ని చెల్లించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివశంకర్, గోపాలకృష్ణ, ప్రసాదరెడ్డి, ఇక్బాల్‌బాషా, నంద్యాల జిల్లా ఎస్టీయూ ప్రధాన ఆ ర్థిక కార్యదర్శులు అజాంబేగ్, శివప్రసాద్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి ఈహెచ్ఎస్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు విడుదల చేయాలన్నారు. వ్యాధిని బట్టి ప్యాకేజీ పేరుతో వైద్య చికిత్సకు అయిన ఖర్చులో తక్కువ మొత్తాన్ని మంజూరు చేస్తుండటంతో ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. ప్యాకేజీని పెంచాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీల్లో స్పౌజ్ కేటగిరి కింద దరఖాస్తు చేసుకున్న వారందరికి బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తప్పించాలన్నారు. 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతి మంజూరు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, జిల్లా కార్యదర్శి ఉస్మాన్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, అంబటి రాజశేఖర్‌రెడ్డి, పి.నరసింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లీజు నిర్ణయాన్ని రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ వైద్య కళాశాలల లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేబినెట్ సమావేశంలో 17 కొత్త వైద్య కళాశాలల్లో పదింటిని పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో కొనసాగించాలని నిర్ణయించడం ఆందోళన కరమన్నారు. 33 సంవత్సరాల లీజుకు ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం ద్వారా 1,500 ఎంబీబీఎస్ సీట్లు ప్రభావితమవుతాయన్నారు. ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల కోటాను 50 శాతం తగ్గించి 50 శాతం సీట్లను మార్కెట్ రేట్లతో విక్రయించడం వల్ల ఫీజులు పెరుగుతున్నాయన్నారు. అలాగే.. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేయాలని, జీవో నం.107, 108ను రద్దు చేసి వంద శాతం సీట్లను ప్రభుత్వ కోటాలో భర్తీ చేయాలని, 17 కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు.

పాస్టర్ల ఆత్మీయ సమావేశం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాము సమీపంలో ఉన్న బైబిల్ మిషన్ దేవధ్యాన మందిరంలో శనివారం దైవ సేవకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బైబిల్ మిషన్ ఏప. సౌత్ ఇండియా డైరెక్టర్ పాస్టర్ రాజు పాల్గొని 500 మందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్వస్థత వార్త, రక్షణ వార్త, రాకడ సిద్ధపడే వార్త అనే అంశాలపై రాబోయే 70 శనివారాలు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. పాస్టర్లు బెన్‌హిన్, దేవప్రేమ్, పాస్టర్ క్రిస్టఫర్, మణిరాజ్, పాస్టర్ జాన్సన్, గ్రేస్, ఇందిరమ్మ పాల్గొన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న విజయ డెయిరీ సిబ్బంది

నంద్యాల(అర్బన్): తలసేమియా చిన్నారులు, గర్భిణులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో వంద మంది సిబ్బంది శనివారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డెయిరీ ఆవరణలో చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు సామాజిక బాధ్యతగా రక్తదానం చేశారు. డెయిరీ ఎండీ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ నంద్యాల బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో ఏటా ఉద్యోగులు తలసేమియా చిన్నారులు, గర్భిణులకు అవసరమైన రక్తాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు.

ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం


మాట్లాడుతున్న రమణయ్య

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఏపీజీటీఏ ఉమ్మడి జిల్లా శాఖ వ్యవస్థాపకులు హుసేన్, రాష్ట్ర కోశాధికారి రమణయ్య, కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వీర రాఘవయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘం నంద్యాల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వీరరాఘవయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆదాం, కోశాధికారిగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, తిరుమల నాయుడు, సంయుక్త కార్యదర్శిగా బసప్ప, బాలాజీనాయక్, గౌరవ సలహాదారుగా వెంకట రమణస్వామిని ఎన్నుకున్నట్లు వివరించారు.

సచివాలయ ఉద్యోగులపై చిన్నచూపు తగదు

ఆళ్లగడ్డ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు తగదని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదుగుల రాజేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక సర్వీస్ చేయించాలని సర్క్యులర్ ఇవ్వడం దారుణమన్నారు. ఇంటింటికి తిరిగి నిత్యం సర్వేలు చేయడానికి తాము వలంటీర్లం కాదని కష్టపడి చదువుకుని మెరిట్ సాధించిన ప్రభుత్వ ఉద్యోగులమన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక అంశాల ప్రస్తావన తెస్తే వాటిని తీర్చకుండా వివిధ రకాల టార్గెట్లు నెత్తిన పెడుతూ వేధించడం ఎంతవరకు సబబు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సర్వేను బహిష్కరిస్తున్నామన్నారు.

22 నుంచి బేస్‌బాల్ రెఫరీ క్లినిక్ జడ్జీల శిక్షణ శిబిరం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు బేస్‌బాల్ రెఫరీ క్లినిక్ జడ్జీల శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా బేస్‌బాల్ క్రీడా సంఘం సభ్యులు సుబ్బయ్య, రమణయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బేస్‌బాల్ రెఫరీపై ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఎస్ఏ పీఈ, పీఈటీలు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు.ఈనెల 18వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9885858183 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేంకటేశ్వరుడికి విశేష పూజలు


సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె దారిలో వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి అమ్మవార్లకు శనివారం విశేష పూజలు నిర్వహించా రు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకు లు వారణాసి గోపీశర్మ, శివ ఉదయాన్నే స్వా మి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భ క్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి అమ్మ వార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటే శ్వరస్వామి ఆలయాల్లో భక్తులు తెల్లవారుజా ము నుంచే ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

22 నుంచి దేవి శరన్నవరాత్రులు


శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సభ పాలక వర్గం సభ్యులు

చాగలమర్రి: మండల కేంద్రంలో వెలసిన కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రోత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్యవైశ్య సభ పాలక వర్గం అధ్యక్షులు మదళ్లపల్లె లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం సాయంత్రం కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శి కూరపాటి రామకృష్ణ వరప్రసాద్ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ఈనెల 22న ప్రారంభమై అక్టోబరు 4న ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ పాలక వర్గం ఉపాధ్యక్షులు క్రిష్ణం శివప్రసాద్, బచ్చు సుబ్రహ్మణ్యం, ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు, ఉప కార్యదర్శులు క్రిష్ణం చంద్రశేఖర్, మాలేపాటి బాబు, ఎం.జ్వాలా నరసింహయ్య, కోశాధికారి తోమ్మంద్రు నాగేంద్ర గుప్త, ఉప కోశాధికారి సుంకు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కథల పోటీలు


కథను వినిపిస్తున్న చిన్నారి

నంద్యాల(వ్యవసాయం): కళారాధన, లయన్స్‌క్లబ్, ఐఎంఏల సంయుక్త నిర్వహణలో స్థానిక వివేకానంద ఆడిటోరియంలో శనివారం కథచెబుతా వింటారా పోటీలు నిర్వహించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ సబ్ జూనియర్ కేటగిరిలో మూడో తరగతి బాల బాలికలు, తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో కథ చెప్పే పోటీల్లో వంద మంది ఆకట్టుకునేలా కథనలు వినిపించారని చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా శేషఫణి, శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా వ్యవహరించారు.

నేడు ముగింపు వేడుకలు..

ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ పురపాలక టౌన్‌హాల్‌లో మాతృభూమికి కళార్చన ముగింపువేడుకలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.పోటీల్లో గెలుపొందిన వారికి షీల్డ్‌ను బహుమతిగా అందజేస్తామన్నారు.

పోస్టల్ సేవలను విస్తృతం చేయాలి


విస్తృత సేవలు అందించిన ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పోస్టల్ బ్యాంకింగ్ సేవలను గ్రామాల్లో విస్తృతం చేయాలని నంద్యాల పోస్టల్ సూపరిండెండెంట్ అప్పలస్వామి సూచించారు. స్థానిక పోస్టాఫీసులో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అప్పలస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోస్టల్ శాఖలో ఉన్న పొదుపు ఖాతాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు పోస్టాఫీసులను, పోస్టల్ సేవలను పొందేలా పనిచేయాలన్నారు. ఎస్‌బీ, ఆర్‌డీ, సుకన్య సమృద్ధి, ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ, బీమా, ఐపీపీబీ తదితర పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఖాతాలకు ఎన్‌పీసీఎల్ లింక్ చేసుకునేలా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ స్థాయిలో పోస్టల్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఆన్‌లైన్ ఎలా ఉపయోగపడుతుందో ఐపీపీబీ మేనేజర్ శ్రీనివాసులు వివరించారు. అనంతరం గత ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. సబ్ పోస్టుమాస్టర్లు, బ్రాంచి పోస్ట్‌మాస్టర్లు పాల్గొన్నారు

ప్రతిభా పురస్కారానికి ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): మదర్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో క్రీడా రంగంలో చేసిన సేవలకు గాను ప్రతిభా పురస్కార అవార్డుకు పీఈటీ పుల్లయ్య ఎంపికయ్యారని సంస్థ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ క్రీడా సామాజిక సేవలు అందించడంతో పీఈటీ పుల్లయ్యను అంతర్జాతీయ మదర్ సర్వీస్ సొసైటీ సంస్థ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి


వినియోగదారులకు జూట్ బ్యాగ్‌లను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మల్లీశ్వరి కోరారు. శనివారం స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, వినియోగదారులకు జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వల్ల కాలుష్యం నుంచి భూమిని కాపాడుకోవచ్చన్నారు. క్లబ్ సభ్యులు సుధా, సుశీల, రమాబాయి, వసుంధర, మధుకుమారి, తులసి, సులోచన, సువర్చల పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందించిన దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మెడిసిన్, ఐఐటీ, నీట్‌లో అద్భుత ఫలితాలు సాధించిన ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం సాయంత్రం పట్టణ సమీపంలోని కళాశాలలో చైర్మన్ కొండారెడ్డి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు సాధించినట్లు తెలిపారు. 22 మంది విద్యార్థులకు మెడికల్ విభాగంలో, ఏడుగురు విద్యార్థులు ఐఐటీ నీట్‌లో సీట్లు సాధించారన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రా చెస్ సంఘం, నంద్యాల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ బ్లిడ్స్ విభాగాల్లో చెస్ పోటీలను శనివారం ప్రారంభించిన ట్లు నంద్యాల జిల్లా సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ బ్లిడ్స్ టోర్నమెంట్ మునినాగలక్ష్మి, రాజేష్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమేల నాగరాజు, జనార్దన్, డాక్టర్ నీల ప్రసాద్, టోర్నమెంట్ నిర్వాహకులు సుజాత పాల్గొన్నారు.

సేవలు కొనసాగిస్తాం

నంద్యాల(అర్బన్): ముస్లింల సమస్యల పరిష్కారానికికి పోరాడుతున్న జేమి యతే ఉలేమా హింద్ సేవలను జిల్లాలో కొనసాగిస్తామని జిల్లా నూతన అధ్యక్షుడు ముఫ్తీ రఫీ సాహెబ్ తెలిపారు. స్థానిక సాయిబాబానగర్‌లోని కుబ్రా మసీదులో జిల్లా నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నా యకులు మౌలానా మహబూబ్‌బాషా, మౌలానా జాఫర్ షాదీక్, మౌలాలీ సాహెబ్ పాల్గొన్నారు.

భక్తులపై తేనెటీగల దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయం సమీపంలో శనివారం 15 మంది భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. వివరాలు..ం ఎమ్మిగనూరుకు చెందిన ఒకే కుటుంబ భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద వెంగమ్మ కొట్టాల వద్ద దాసంగం పెట్టేందుకు వంట చేస్తున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు మాధవి, సంగీత, సరస్వతి, లత, అంపయ్య, లక్కీలపై దాడి చేశాయి. అదే సమయంలో పక్కన వెళ్తున్న ఆర్ఎస్ రంగాపురానికి చెందిన మరో 10 మంది భక్తులపై కూడా దాడి చేశాయి. గాయపడిన వారిని బేతంచెర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రజకులపై దాడులను అరికట్టాలి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): జిల్లాలో రజకులపై జరుగుతున్న దాడులు అరికట్టి, వారికి ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఆలిండియా ధోబీ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు కోరారు. ఈ మేరకు శనివారం సంఘం నాయకులతో కలిసి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రజకులకు ధోబీ ఘాట్లు ఏర్పాటు చేసి, రజకుల ఇళ్లకు 300 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ల ద్వారా అర్హులైన వారికి పనిముట్లు, దేవాలయాల్లో దివిటీలు పట్టే రజకులకు దేవస్థానం కమిటీ మెంబర్లుగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నాగయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైద్యులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


డాక్టర్ జహంగీర్‌ను సన్మానిస్తున్న వైద్యులు

గోస్పాడు: వైద్యులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రముఖ గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్లు జహంగీర్, మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో ఐడీఏ రాయలసీమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా దంత వైద్యులకు గుండె వ్యాధులపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు ఒత్తిడి తగ్గించుకునేందుకు రోజుకు కనీసం 45 నిమిషాల నడకతో పాటు యోగా, ధ్యానం చేయాలని సూచించారు. కనీసం సంవత్సరానికి ఒకసారి గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు. గుండె జబ్బులు ఉన్న వారు, గుండె ఆపరేషన్ చేయించుకున్న వారికి దంత వైద్య చికిత్సల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీనియర్ వైద్యుడు గెలివి సహదేవుడు, ఐడీఏ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కిశోర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు డాక్టర్లు వరుణ్‌కుమార్‌రెడ్డి, సునీల్ జుషువా, చాందిని, రాజీవ్, రవికుమార్, అనిల్ కుమార్, ఈశ్వరీ పాల్గొన్నారు.

గట్టుపైన చెట్టు.. కాల్వకు ముప్పు


ఎస్సార్బీసీ కాల్వ గట్టును చీల్చుకుంటు ఏపుగా పెరిగిన చెట్టు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ గట్టుపై ఏపుగా పెరిగిన ఓ చెట్టు కాల్వ పటిష్టతకే ప్రమాదకరంగా మారింది. బ్లాక్–3 వద్ద ఓ చెట్టు అంతకంతకు ఏపుగా పెరిగి మానయ్యింది. చెట్టు పెరిగే కొద్దీ ప్రధాన కాల్వ లైనింగ్‌ను చీల్చుకుంటూ పోతోంది. ఇది ప్రమాదనికి సంకేతానిస్తోంది. అధికారులు సకాలంలో చర్యలు తీసుకొని కాలువను పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.

శ్రీశైలం హరిత రిసార్ట్‌ను పరిశీలించిన చైర్మన్

శ్రీశైలంటెంపుల్: ఏపీ టూరిజం ఆధ్వర్యంలో శ్రీశైలంలోని హరిత రిసార్ట్‌లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పరిశీలించారు. శనివారం ఆయన శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం టూరిజం హరిత రిసార్ట్‌కు చేరుకుని పనులను పరిశీలించి పలు సలహాలిచ్చారు. భక్తులకు మెరుగైన వసతులు, ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఆయన వెంట యూనిట్ మేనేజర్ పవన్ కొణిదెల, డీఈ శ్రీనివాస్ యాదవ్, ఏఈ రామకృష్ణ రెడ్డి, టూరిజం శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహానంది: ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ శనివారం మహానందీశ్వరస్వామిని, కామేశ్వరీ దేవిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక వసతి గృహాలను, రెస్టారెంట్‌ను పరిశీలించారు. ఏపీ టూరిజం వసతిగృహాలు, రెస్టారెంట్‌కు మంచి ఆదరణ ఉందని, రెనోవేషన్‌కు సహకరించాలని డీవీఎం జి.లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేయగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

భాద్రపద మాస పూజలు


మద్దిలేటిస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సందడి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించి, స్వామివారి ఇష్టమైన వరపూజ చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన నృత్యకళా నిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వినాయకకౌత్వం, దుర్గాస్తుతి, శివశంభో శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు సత్యానందిని, భావన, సుజయరాఘవి, లావణ్య, సంజన తదితరులు నృత్యప్రదర్శన చేశారు.